కథా నిలయం
5635
శ్రీకాకుళం

# ఢాకన్

ముబషీరా బేగంకు ఏ వస్తువు మీద మూత ఆ వస్తువు మీద కరెక్టుగా సరిపోవాలి.

చిన్నదైతే ఒప్పుకోదు. పెద్దదైనా ఊరుకోదు.

రసూల్ అహ్మద్‌కు ఆ సంగతి ఈ జన్మకు అర్థం కాదు.

రాత్రి పూట ఆయన టీవీలో వార్తలు చూస్తూ కూర్చుని ఉన్నప్పుడు ఆమె కునుకు తీయడానికి వెళుతూ 'జీ.. ఆ పెరుగు మీద కాస్త మూత ఉంచి అల్మారాలో పెట్టండి' అనంటే యిక ఆయన ఆరాటం చూడాలి ఎంత వెతికినా దానికి సరిగ్గా సరిపోయే మూత కనిపించేది కాదు.

కాసేపు అది కెలికి, యిది కెలికి మొత్తం మీద ఏదో ఒక మూతను గిన్నెపై

మూసి అల్మారాలో పెట్టేవాడు.

కాసేపటి తర్వాత ముబషీరా లేచి వచ్చి, అల్మారా తెరిచి, ఊహించిన ట్టుగానే పెద్దదో చిన్నదో ఉన్న మూతను తీసి సరిగ్గా సరిపోయే మూతను అమర్చి నిద్రపోయేది.

ఆమె అలా బతికిన మనిషి. అలా బతుకుతున్న మనిషి.

సంసారపు గుట్టుమట్లను కచ్చితంగా పాటించే మనిషి.

ఎవరికి ఎంత తెలియాలో అంత తెలియాలి. బయటకి ఎంత వెళ్లాలో అంత వెళ్లాలి. ఇతరుల నుంచి ఎంత దాచాలో అంత దాచాలి. మనం ఎంతలో ఉండాలో అంతలో ఉండాలి.

ఆ సంగతి కూడా రసూల్ అహ్మద్‌కు ఈ జన్మకు అర్థం కాదు.

అర్థమై ఉంటే పెద్దకూతురు ఎవరితోనో వెళ్లిపోయినప్పుడు నానా యాగీ చేసేవాడు కాదు. నలుగురికీ తెలిసేలా ప్రవర్తించేవాడు కాదు.

'వెళ్లిందేదో వెళ్లింది గుట్టుచప్పుడు కాకుండా ఊరుకోండి' అని ముబషీరా చెప్పినా విన్నాడా?

కత్తి పట్టుకొని, ఈ ముసలివయసులో వీరంగాలు ఆడుతూ వీధిలో తిరిగాడు. ఆ తర్వాత చల్లబడి వచ్చి ఇంట్లో కూర్చున్నాడు.

పెద్దకూతురు చేసినది తప్పు కాదు.

అప్పటికి ఆమెకు ముప్ఫయి ఏళ్లు వచ్చాయి. చురుకైన అమ్మాయి. తెలివిగ లది. తల్లీదండ్రీ ఏమరుపాటుగా ఉన్నప్పుడు అలా గడప దగ్గరకు వచ్చి బయ టకు తొంగి చూస్తూ నిలుచుని ఉండేది. బజారులో, స్వేచ్ఛగా పరిగెడుతున్న వాహనాలలో, అటూ ఇటూ తిరిగే మనుషులలో, వారి మాటలలో, లావాదే వీలలో పడి ఆ కాసేపైనా ఆమె తనను తాను మర్చిపోయేది.

ఆమెను కొన్నాళ్లపాటు ఒక ఆటోడ్రైవరు వేధించాడు. ఆమె కనిపించినప్పు డల్లా అతడు ఏదో ఒకటి మాట్లాడేవాడు, సైగలు లాంటివి చేసేవాడు. ఆమెకు కోపం వచ్చేది. మరి కొన్నాళ్లకు దయ కూడా కలిగేది. మరో గత్యంతరం లేన ప్పుడు అయిష్టాన్ని యిష్టం చేసుకొని అతడితో వెళ్లిపోయింది.

కానీ ఊరు ఊరికే ఉంటుందా?

అదీ చిన్నఊరు. మిర్యాలగూడ. అందులోనూ ఒక ముస్లిం మొహల్లా అను

కుందాం. కూతురు లేచిపోయాక ముబషీరాబేగం యింట్లోకి అది తొంగి తొంగి చూసింది.

ఇస్లాంమతంలో జన్మించాక ఏవో కొన్ని కట్టుబాట్లు, అతి కట్టుబాట్లు, తప్పు చేస్తే అల్లాకు జవాబు చెప్పాల్సిన విషయాలు అనేకం ఉంటాయి. వాటిని అసలు వాళ్లు మర్చిపోయినా ఇతరులు గుర్తు చేయక ఊరుకోరు.

అందుకని మొత్తం మీద అక్కడ అన్నాళ్లుగా సాగిన సజావు బతుకు యిక ముబషీరాకు ఎక్కువ తక్కువగా అనిపించింది. ఇక అక్కడ ఉండటం సరికాదని అనుకుంది.

అదీగాక ఇంట్లో ఇంకా ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

వారికి తగిన అబ్బాయిలను చూసి, మర్యాదగా మన్ననగా నలుగురి ఎదుటా తలఎత్తుకొనేలాగా వాళ్ల పెళ్లిళ్లు చేస్తే తప్ప లోకం వాళ్ల వైపు నుంచి దృష్టి మరల్చదు. అంతవరకూ దానికి ఎంత సానుభూతి ఉంటుందంటే 'అసలే ఈ రోజుల్లో ఆడపిల్లలకు పెళ్లిళ్లు కావడం కష్టం. ఇక పెద్దమ్మాయి చేసిన పనికి పాపం వీళ్లకు మొగుళ్లు ఎక్కడ నుంచి వస్తారూ?' అని చీటికి మాటికి అంటూ ఉంటుంది. సంబంధాలు వెతుక్కుంటూ ఎవరైనా వచ్చినప్పుడైతే దాని నోటి నుంచి ఆ మాట అనుకోకుండానే వచ్చేస్తుంటుంది.

ముబషీరా ఆలోచించింది.

'మీరు రిటైరయ్యి యింట్లో ఉన్నారు. అబ్బాయి బయట చదువుతున్నాడు. మీ పుణ్యాన సొంత యిల్లు ఎట్లాగూ లేదు. ఇంక మనకు ఏ ఊరు అయితే ఏమిటి? హైద్రాబాదు పోదాం. పెద్ద ఊరు. మనల్ని ఎవరు పట్టించుకుంటారు. వయసొచ్చిన ఆడపిల్లలను యింత చిన్న మొహల్లాలలో దాచిపెట్టలేం. జవాబు చెప్పలేం. అక్కడైతే ఎవరిలోకం వారిది. ఏమంటారు? యిక్కడ బంధువులూ వాళ్లూ వీళ్లూ ఉన్నారంటారా? వాళ్ల కంటే జాన్‌వర్‌లు నయం' అంది.

రసూల్ అహ్మద్ సరే అన్నాడు.

ఆయనకు వేరే దారి కూడా లేదు. పోస్టాఫీసులో రిటైరయ్యేదాకా ఆయనకు పోస్టాఫీసూ, ఇల్లూ తప్ప మరో లోకం తెలియదు. రిటైరయ్యే సమయానికి పిల్లలు ఎదిగొచ్చి పెళ్లిళ్లకూ, కొడుకు ఎమ్‌సెట్ రాసి ఇంజనీరింగ్‌కూ చేరేసరికి అంతవరకూ ఆయన చేసిన ఉద్యోగమూ చేతికందబోయే పెన్షనూ అంత గిట్టుబాటైనవి కావని అర్థమయ్యింది.

గుహలో ఉన్న మనిషి హఠాత్తుగా బయటకు వచ్చినట్టు కొంతకాలంపాటు

ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ఆ తర్వాతైనా సర్దుకొని, రిటైరయ్యానని ఊరుకోక రోజూ పోస్టాఫీసుకు వెళుతూ చదువురానివాళ్లకు ఎంఒలు, ఎఫ్‌డి ఫారాలు, సేవింగ్స్ లావాదేవీలు చూసి పెట్టి వారిచ్చే తృణమో పణమో ఇంటికి తెస్తున్నాడు.

కానీ అది ఏ మూలకు?

సరే.. ముందు హైద్రాబాద్ చేరితే మళ్లీ ఏదైనా ఆలోచించవచ్చు అనుకున్నాడు.

వాళ్లు హైద్రాబాద్ చేరారు.

మదీనాకు దగ్గరగా, లక్కడ్‌ఖోట్ వెనుక చిన్న బస్తీ ఉంటే అందులో ఒక మూడు గదులున్న యింటిని అద్దెకు తీసుకున్నారు.

కొత్త ఊరు.. కొత్త వాతావరణం..

అయినాగానీ అక్కడ ఉంటే మొహల్లాలోనే ఉంటున్నామన్న ధైర్యం ఒకటి. కిరాయి తక్కువ కావడం వల్ల మిగిలే డబ్బు ఒకటి.

ఇక ముబషీరాకు అన్నింటికంటే నచ్చిన విషయం వాళ్లు తీసుకున్న యిల్లు కొంచెం లోపలిగా ఉండటం. వీధి కూడా కొంచెం చీకటిగా, సన్నగా, మూలగా ఉండటం.


యింట్లో దిగి సామాన్లు సర్దుకున్నాక ఆమె మొదటగా చేసిన పని ఆ యింట్లోని అన్ని తలుపులకూ కిటికీలకూ వాటికి సరిగ్గా సరిపోయే కర్టెన్లు కుట్టి లోపలివి బయటకు బయటవి లోపలికి కనపడకుండా చేయడం. ఆడపిల్లలు యిద్దరికీ మూలగదిని కేటాయించడం. వాళ్లు పొరపాటున బయటకు వెళితే తెలియడానికీ, గడప దగ్గర నిలబడినప్పుడు గమనించడానికీ వీలుగా ముందు గదిని తనకూ భర్తకూ ఉంచుకోవడం.

ఇక ఇది కొత్త జీవితం.

పెద్దగా ఎవర్నీ ఎవరూ పట్టించుకోని జీవితం.

తింటున్నారా లేదా, మంచి బట్టలు తొడుక్కుంటున్నారా లేదా, జబ్బొస్తే మంచి మందులు తీసుకుంటున్నారా లేదా, ఆడపిల్లలకు వయసొస్తే పెళ్లిళ్లు చేస్తున్నారా లేదా అని ఎవరూ గుచ్చి గుచ్చి చూడరు. కొత్తవాళ్లు కాబట్టి కనీసం వీళ్ల వరకైనా అడగరు. ఎవరి లోకం వారిది. ఎవరి బాధలూ వారివే.

కొన్నాళ్లు గడిచాక ముబషీరా అప్పుడప్పుడూ బయటకు వెళ్లేది.



ఇంటి మర్యాద తెలిసేలాగా చక్కటి చీర కట్టుకొని, కుచ్చిళ్లు జాగ్రత్తగా మడతపడేలా చూసుకొని, ఆభరణాలు అవీ లేకపోయినా మ్యాచింగుకు సరిపోయే మట్టిగాజులు తొడుక్కుని, విశాలమైన ఛాతీ మీద ఒక నల్లపూసల దారం వేలాడేసుకొని వారింటికీ  వీరింటికీ పలకరింపుగా వెళ్లేది. వారితో తేటగా, స్నేహంగా మాట్లాడేది.

'మా అబ్బాయి సమద్ ఇంజనీరింగు చదువుతున్నాడు. చదువయ్యాక ఉద్యోగం కోసం హైదరాబాదు రావాలి కదా. అందుకని మేమే ముందు వచ్చి ఇక్కడ ఉంటున్నాం' అని వారితో అనేది.

'మా మిర్యాలగూడ బంధువులలో చక్కటి ఆడపిల్లలు ఉన్నారు. ఇక్కడ మీకు తెలిసి ఏమైనా సంబంధాలు ఉన్నాయా?' అని ఆరా తీసేది.

సంబంధాలంటే వాళ్లు రెండు రకాలుగా చెప్పేవారు.

ఒకటి: పెళ్లయ్యాక, పెట్టుబడి పెట్టి, వీసాలు గీసాలు భరించి అబ్బాయిని సౌదీకో, దుబాయ్‌కో పంపి రెండేళ్లు కళ్లు మూసుకోవాలి. అతడు అక్కడ సంపా

దించుకొని వచ్చి ఆ తర్వాత కాపురం పెట్టుకుంటాడు. అంతవరకూ అమ్మగారింటిలోనే ఆడపిల్ల ఉండాలి. దీనికి లక్ష వరకైతే సరిపోతుంది. అలా కాదూ అబ్బాయి ఇక్కడే ఉండాలి వెంటనే కాపురం పెట్టాలి అనంటే ఉద్యోగానికో, వ్యాపారానికో రెండుకు పైమాటే ఇచ్చుకోవాలి. బండి కూడా కంపల్సరే.

ఇది చెప్పాక ఆ మాటా ఈ మాటా మాట్లాడి చివరలో-

'ఇవాళ రేపు మన మగపిల్లల పరిస్థితి ఎవరికి తెలియదు? అందరూ వెట్టికి బతుకుతున్నారు. ఇక్కడ వాళ్ల కోసం ఏదైనా దారి లేదు నిలబడేదానికి ఏదైనా చోటు లేదు. పొట్ట పట్టుకొని పరాయి ముల్క్‌కు పోతేనే పని. ఇక్కడుంటే చిన్నా చితకా పనులూ లేకుంటే బేరోజ్‌గారీ. అందుకని చూసి చూసి వాళ్లు ఆడపిల్లలనే సహారా చేసుకుంటున్నారు. పెళ్లే వాళ్లకు నీడను ఇస్తోంది' అని అనేవారు.

'మీకు కూడా ఆడపిల్లలు ఉన్నట్టున్నారు కదా' అని ముబషీరాను అడిగితే-

'అయ్యో.. వాళ్ల వయసు ఎంతనీ? చిన్న పిల్లలు.. అప్పుడే ఏం పెళ్లి' అని ఆమె కంగారు తెలియనీకుండా జవాబు చెప్పేది.

'మా షౌహర్‌ది లేటు పెళ్లి. నాకూ ఆయనకు పన్నెండేళ్ల ఎడం ఉంది. పిల్లలు కూడా లేటుగా పుట్టారులేండి' అనేది పవిట సర్దుకుంటూ.

కానీ ఆ పవిట లోపల ఆమె గుండెలు అవిసిపోతూ ఉండేవి.

ఈ లెక్కన ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్లకి మూడు నాలుగు లక్షలు అయినా కావాలి.

అంత డబ్బు ఎక్కడ ఉంది? దానిలో నాలుగో వంతైనా ఉందా?

అమ్మాయిలకి ఖురాన్ చదివించి, నమాజు నేర్పించి, వంట- ముఖ్యంగా బగార్ అన్నం, బిరియాని రుచిగా చేయడంలో తర్ఫీదు ఇస్తే పెళ్లి చేశాక వాళ్ల బతుకు వాళ్లు హాయిగా బతుకుతారు.

మరి అబ్బాయి సంగతి అలా కాదు. ఒక్కగానొక్క కొడుకు. కొంచెం తెలివైనవాడు. అందరూ చదివిస్తున్నప్పుడు మనం కూడా బిటెక్ చదివించకపోతే ఏం మర్యాద అనుకొని వాడికి అంత మంచి ర్యాంకు రాకపోయినా కర్నాటకా తీసుకువెళ్లి అక్కడ ఉండే ఒక మైనారిటీ ఇంజనీరింగ్ కాలేజీలో దాచినదంతా కట్టి చేర్పించారు.

చేర్చడం ఒక ఎత్తయితే చేర్చాక చదివించడం ఒక ఎత్తని చేర్చిన కొన్నాళ్లకే వారికి అర్థమైపోయింది. ఫీజుల దగ్గర, నెలవారీ ఖర్చుల దగ్గర, తిండీబట్టా

దగ్గర మైనారిటీ ఏంటి మెజారిటీ ఏంటి? వాడు ఉన్నంతలో జాగ్రత్తపరుడే. అయితే మాత్రం.. ఈ పెన్షన్‌లో నుంచే అంతో యింతో పంపాలి కదా.

రోజులు కఠినంగా కదులుతున్నాయి.

రసూల్ అహ్మద్ బయట తిరిగి ఒకటి రెండు ప్రయత్నాలు చేశాడుకానీ పాతబస్తీలో నెగ్గుకురావాలంటే ఉర్దూ చదవడం, రాయడం వచ్చుండాలని అర్థమయ్యాక, ఆ రెండు పనులూ రాక కాలక్షేపానికి కూడా దగ్గరిలో ఉన్న పోస్టాఫీసుకి వెళ్లడం మానుకున్నాడు.

ఆయనకు ఇప్పుడు ఇరవై నాలుగు గంటలూ టీవీతోనే పని.

ఆ టీవీయే గనక లేకపోతే ఏమైపోతాడా అని అప్పుడప్పుడు ముబషీరాకు భయం వేస్తూ ఉంటుంది.

ఆడపిల్లలు యిద్దరూ కూడా ముబషీరాను పెద్దగా యిబ్బంది పెట్టడం లేదు. మెత్తటి గొంతుతో మాట్లాడటం, నమాజు చదవడం, శబ్దం రాకుండా నవ్వడం, ఎప్పుడో తప్ప- అది కూడా తల్లితో నిండు బురఖాలో బజారుకు వెళ్లడం మినహా వారితో పేచీ లేదు.

వాళ్లని సరిగ్గా ఎవరూ చూసింది లేదు.

వాస్తవానికి ఒక్క ముబషీరాకు తప్ప వారి శరీరాల్లో ఏం జరుగుతూ ఉందో ఎవరికీ తెలిసిందీ లేదు.

వారికి తలకు పోస్తున్నప్పుడు, వారు లోదుస్తులు మార్చుకుంటూ ఉన్నప్పుడు, ఒక్కోసారి బట్టలు చెదిరేలా ఆదమరచి నిద్రపోతూ ఉన్నప్పుడు ఆ పెద్దెనిమిది యిరవై ఏళ్ల ఆడపిల్లలు, వయసొచ్చిన కన్నెపిల్లలు బరువైన వక్షంతో, మిసమిసలాడే రంగుతో, వెడల్పాటి పిరుదులతో కనపడితే ఆమెకు పెద్దకూతురు గుర్తుకు వచ్చి లోపల కత్తి దిగబడినట్టుగా అనిపించేది.

ఆ అమ్మాయి కూడా ఆ వయసులో అలాగే ఉండేది. దానిమ్మపండులా నిగనిగలాడుతూ ఉండేది.

కానీ వయసు పెరిగే కొద్దీ రోజులు గడిచే కొద్దీ పెళ్లి సంబంధాలు చేజారే కొద్దీ ఆ పండు గిడసబారిపోవడం, లోపలి గింజలు తడి ఆరిపోవడం, ఆమె స్తనాలతో పాటు కాయమే ఎండిపోయి ఒక పూచికపుల్లలా ఇంట్లో తిరుగాడుతుండటం ముబషీరా నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది.

అలాంటి అవతారంలో కూడా ఆశ చావక ఆ పిల్ల ఎలా వెళ్లిపోయిందో

వాడి దరిద్రం కొద్ది ఆ ఆటోవాడు ఎలా తీసుకువెళ్లాడో వాళ్లు ఎక్కడ ఉన్నారో ఆమెను ఏమి చేశాడో...

అందుకే ఆ అమ్మాయి గురించి ఆమెకు ఎప్పుడూ ఆలోచించ బుద్ధి కాదు.

ఆలోచించితే యిక ఏమీ సయించేది కాదు.

అటువంటప్పుడు ఆమె చప్పున మౌనం దాల్చేది. ఏ మాటా లేనట్టుగా చాలాసేపు అటూ ఇటూ పచార్లు చేస్తూ గడిపేది. రాత్రుళ్లు అందరూ నిద్రపోయాక ఎవరి కంటికీ కనబడకుండా కడుపులో గుద్దుకుంటూ ఏడ్చేది. చాలా సేపు ఏడ్చేది.

కానీ తెల్లవారేసరికి మళ్లీ మామూలుగా కనిపించేది. పిల్లలతో చలాకీగా మాట్లాడేది. వాళ్లకి జడలు వేసేది. మెహందీ పెడుతూ సౌందర్య రహస్యాలు తెలియజెప్పేది. అంతెందుకు.. ఆమె కళ్ల కింద ఉన్న నల్లటి చారల మీద నీటుగా కత్తిరించిన దోసకాయముక్కలు సరదాగా పెట్టుకునేది.

'నా బంగారుతల్లులూ... మీకు రాకుమారులు వస్తారమ్మా' అనేది పిల్లలతో.

అప్పుడు ఆ పిల్లలు హుషారుగా, పరవశంగా కిలకిలా నవ్వేవారు.

ఆమె కూడా వారితో పాటు కలిసి నవ్వేది.

అప్పుడే ఆమె వారి మనసు మళ్లించడానికి ప్రయత్నించేది.

'ఊరికే ఉండటం ఎందుకు? ఏదైనా పని చేసుకుంటే కాలక్షేపం' అనేది.

లాడ్ బజార్‌లో చమ్కీపని దొరుకుతుందని ఎవరో అంటే ఒకరోజు వెళ్లి సేట్‌లతో మాట్లాడి వచ్చిందామె. వారు చీరలు, డ్రస్‌మెటీరియళ్లు పంపితే వాటికి వీలైనంత కుదురైన డిజైనుతో చమ్కీలు కుట్టి, అంచులు దిద్దడం పని. నాలుగు డబ్బులు వచ్చే పని. రసూల్ అహ్మద్‌కు కాస్త కాలు సాగే పని కూడా.

పిల్లలు ఎంతో ఉత్సాహంగా ఆ పనిలో పడిపోయారు.

ఇంకా చెప్పాలంటే పెళ్లికూతురు చీరల పని చేస్తున్నప్పుడైతే వాళ్లకు ఒళ్లు తెలిసేది కాదు. ఆకుపచ్చ, ముదురాకుపచ్చ, పండుమిరప రంగు, ముక్కుపొడి రంగూ, నీలం... మెత్తటి ఆ చీరల మీద మిలమిలా మెరిసిపోయే బంగారు రంగు చమ్కీలు అద్దుతూ ఉంటే ఎందుకనో వారికి లోలోపల చాలా సంతోషంగా అనిపించేది. ఒక్కోసారి ఆ కొత్తపరిమళాలకు తాళలేక వాటిని గట్టిగా గుండెలకు హత్తుకునేవారు.

సీజన్‌లో, రంజాన్‌మాసంలో వాళ్లు ఎంత పిచ్చిగా పని చేసేవారంటే మొహల్లా మొత్తం గాఢనిద్రలో మునిగిపోయినా వాళ్ల ఒక్కరి ఇంట్లో దీపం వెలుగుతూ ఉండేది. ఆ శ్రమకు వచ్చిన డబ్బుతో ఆ వస్తువూ ఈ వస్తువూ కొనుక్కుంటున్నప్పుడు ఆ వెలుగు వారి ముఖాల్లో ప్రసరించేది.

అది చూస్తే ముబషీరాకు ముచ్చట.

'ఏమిటి?.. మీ పెళ్లిళ్ల కోసమని మీరే అన్నీ కొనేసుకుంటున్నారా?' అని నవ్వుతూ వారిని ఉత్సాహపరిచేది.

అయితే ఆ ఉత్సాహం కొంతకాలమే.

ఈ పని అంత స్థిరమైనది కాదని, నమ్ముకోదగ్గది కాదని వారికి తొందరలోనే అర్థమైపోయింది.

పాతబస్తీ వాతావరణం కలిగించిన ఎరుక అది.

బెస్తవాడు కూడా కనిపెట్టలేని సముద్రపు వాతావరణం...

అందరూ తిరుగుతూ తిరుగుతూ ఉండగానే ఉన్నట్టుండి చార్‌మినార్ కమాన్‌ల మీద నల్లటి మబ్బులు కమ్ముకునేవి. గాలి దుమ్ము చిమ్ముతూ గట్టిగా వీయడం మొదలుబెట్టేది. మరి కాసేపటికి మబ్బుల నుంచి ఎడతెరిపిలేని రాళ్ల వర్షం కురిసేది.

అల్లర్లు. నిరసనలు. దహనాలు.

మనుషులు పారిపోయిన వీధులు. మూతపడ్డ దుకాన్‌లు. మృతదేహాలు.

మందిర్–మస్జిద్.

రామ్ జన్మభూమి.

ఎవరో ఎక్కడో అన్న మాట శుక్రవారం పూట మక్కామసీదు దగ్గర భాస్వరమై మండేది. ఆ అగ్గి నుంచి ఒక ఘోష రేగేది. మనుషులు గుంపులు గుంపులుగా మందలు మందలుగా కొత్తనగరం వైపుకు చొచ్చుకొని రావడానికి దూసుకుపోవడానికి చూసేవారు. పోలీసులు వారికి సరిహద్దు గీసి బయటకి రానీకుండా పాతనగరంలోనికి తరిమి తరిమి కొట్టేవారు.

ఈ పని చాలా సేపూ జరిగేది. చాలా సార్లూ జరిగేది.

అంతా అయ్యాక లాఠీలూ రాళ్లతో పాటు ఎవరి బాపతో తెలియని చెప్పుల్లా అక్కడక్కడా ఒకరిద్దరు కూలి పోయి కనిపించేవారు.



ముబషీరా ఇదంతా భయం భయంగా చూసేది. ఒళ్లు చల్లబడుతూ ఉంటే వింత వింతగా గమనించేది.

ఆమెకు వారి ద్వారా వీరి ద్వారా అనేక సంగతులు తెలిసేవి.

మసీదు ఎదుట నిలుచుని 'నారే తక్బీర్.. అల్లాహో అక్బర్' అని నినాదాలు చేసినందుకు ఒకసారి కొంతమంది ముస్లిం యువకులను పోలీసులు పట్టుకొని వెళ్లి నడవడానికి వీల్లేని విధంగా కొట్టారని ఒకావిడ చెబితే ఆమెకు నోట మాట రాలేదు.

'అదేమైనా చెడ్డమాటా?' అంది ఆశ్చర్యపోతూ.

'ఏది చెడ్డమాట? అల్లాహో అక్బర్ చెడ్డమాటా? మరి అలాగైతే జైశ్రీరాం చెడ్డమాటా? ఆ మాట అన్నవాళ్లని కూడా అలాగే తీసుకొని వెళ్లి కొడుతున్నారా?

చితకబాదుతున్నారా? అది కాదు సంగతి. మొత్తంగా ముస్లింలే చెడ్డవారు. వాళ్లు చేసే పనులన్నీ చెడ్డవి. వాళ్ల జాతే చెడ్డది. అదీ సంగతి. ఇవి మనరోజులు కావు. మనం మాట్లాడడానికి లేదు. నోరు మెదపడానికి లేదు. అన్నీ మూసు కోవాల్సిందే' ఆవిడ ఏడుస్తూ లోపలికి వెళ్లిపోయింది.

పోలీసులు పట్టుకెళ్లిన వారిలో ఆమె కొడుకు కూడా ఉన్నాడంట. ఇంటరు చదివే పిల్లవాడు.

ముబషీరాకు ఇలాగే ఎన్నో మాటలు తెలిసేవి.

పాకిస్తాన్, ఐఎస్ఐ ఏజెంట్, ఇస్లామిక్ టెర్రరిస్ట్, జిహాదీ...

వినేకొద్దీ ఆమెకు ఈ పురాతన నగరం మీద ఏదో తెలియని షైతాన్ నీడ కమ్ముకుంటున్నట్టుగా అనిపించేది.

ఈ బితుకు బితుకు భయంలోనే ఒక్కసారిగా గుజరాత్ అల్లర్లు చెలరే గాయి.

గోధ్రాలో రైలు తగలబెట్టినప్పుడే పాతబస్తీలో ఏదో మార్పు వచ్చింది.

ఇక అక్కడ అల్లర్లు మొదలయ్యాక దాని కాళ్ల కింద భూమి మొత్తం కదిలి పోయింది.

ఆ రోజు పాలు, కూరగాయలూ వీలైనన్ని తీసుకొని వడివడిగా ఇల్లు చేరడం ఆమె ఎప్పటికీ మర్చిపోలేదు.

ఇక అప్పటి నుంచి రసూల్ అహ్మద్ సగమైపోయాడు. ఆయన వద్దంటే టీవీ చూస్తూ గుజరాత్‌లో ఏం జరుగుతున్నదో గమనిస్తూ రాత్రంతా నిద్రలేన ట్టుగా తిరుగుతూ ఉండేవాడు. మాటిమాటికి తలుపు గొళ్లాలు సరి చూసి వస్తుండేవాడు. పిల్లలు పడుకున్న గది వైపు వెళ్లి వాళ్లు భద్రంగా ఉన్నారో లేదో తొంగి తొంగి చూసేవాడు.

బయట భయం.

ఏ క్షణాన్నయినా అల్లర్లు మొదలవుతాయనే పుకార్లు.

రాళ్లు.

ఉండి ఉండి వెర్రికేకలు వినిపించినప్పుడల్లా ఆయన గబుక్కున పిల్లల గదిలో దూరి వారిని చెరోరెక్క కింద పొదుక్కొని ఉన్న ముబషీరా దగ్గర కూల బడేవాడు.

భయంతో తల్లిని అంటిపెట్టుకొని ఉన్న ఆ ఆడపిల్లలని చూస్తే ఆయనకు బయటకు చెప్పలేనన్ని భీతిగొలిపే ఆలోచనలు వచ్చేవి. ఏదైనా అల్లరిమూక ఇంట్లో దూరి ఆ పిల్లలిద్దరినీ తమ కళ్ల ఎదుటే అత్యాచారం చేస్తే చూస్తూ తట్టుకోవడం ఎలా అనే ఆలోచనతో ఆయన విలవిలలాడిపోయేవాడు.

ఆసరా కోసం ఆయనకు ముబషీరా వైపు చూడాలనిపించేది.

కానీ ఆ చీకటి గదిలో దీపాలు ఆర్పిపెట్టిన గదిలో ఆమె ముఖంలో ఏముందో ఆయనకు తెలిసేది కాదు.

పరిస్థితులు సద్దుమణిగి, చీకటి వీడి కొంచెం కొంచెంగా వెలుగు వస్తున్న రోజున కర్నాటక నుంచి కొడుకు దిగాడు.

అక్కడ కూడా పరిస్థితి బాగలేదట. వాడు చదువుతున్న మైనారిటీ కాలేజీ తాత్కాలికంగా మూతపడింది.

'ఇంక పోను అబ్బా. చదవాలని కూడా అనిపించడం లేదు' అన్నాడు వాడు.

రసూల్ అహ్మద్ గుండె జారిపోయింది.

'ఏమిట్రా నువ్వు చెప్పేది?' అన్నాడు.


'మీకు తెలియదు అబ్బా. మా వయసు కుర్రాళ్ల మనసులు ఈ క్షణాల్లో ఎలా ఉంటాయో మీకు తెలియదు. మేము ఎంత ఏడ్చామో తెలుసా? ఎక్కడ హంతకులుగా మారిపోతామో అని భయపడి ఎవరి ఇళ్లకు వాళ్లం వచ్చేశాం. ద్వేషం నిండిపోతోంది అబ్బా. వద్దనుకుంటున్నా ద్వేషం నిండిపోతోంది. బయట ఏం జరుగుతున్నదో నాకు అనవసరం. నేను చూడదలుచుకోలేదు. వినదలుచుకోలేదు. వింటే మనిషిగా ఉండలేను. నాకు మీరంతా ఉన్నారు. ఏదో నన్ను చదివించే పని చేశారు. చాలు. ఇంక నా వల్ల కాదు. పుస్తకం తెరిస్తే నెత్తురు కనపడుతోంది. ఒక్క అక్షరం కూడా ఇక నేను చదవలేను. ఇక్కడే ఉండి ఉన్నంతలో మీకేదైనా సాయపడతాను'.....

రసూల్ అహ్మద్ చాలా సేపు అలా కొడుకు వైపే చూస్తూ ఉండిపోయాడు.

ఆ తర్వాత వాణ్ణి దగ్గరికి పిలుస్తూ 'ఇలారా.. సమద్' అన్నాడు.

కొడుకు ఆ తండ్రి గుండెల మీద సేద తీరాడు.

'ఊరుకో... ఏడవకురా'.. అని వాడి వీపును నిమురుతూ ఉండిపోయాడాయన.



ఆ రాత్రి ఆయనకు చాలాసేపు నిద్రపట్టలేదు. తెల్లవారుతుండగా కన్ను మూతపడుతూ ఉంటే ఎడమ చేయి నొప్పిగా అనిపించింది. మరి కాసేపటికి గుండెల మీద సమ్మెటపోట్లు పడుతున్నట్టుగా అనిపించింది. చివరగా ఒక గురకలాంటి శబ్దం చేశాడాయన.

రుజువర్తన కలిగిన వారిని అల్లా ఏ శ్రమా యివ్వకుండా తీసుకుపోతాడని రసూల్ అహ్మద్ కఫన్‌ను చూసిన నలుగురూ చెప్పుకున్నారు.

'అదృష్టవంతుడు. బతికి ఉంటే ఇంకా ఎన్ని చూడాల్సి వచ్చేదో' అని ముబషీరా దగ్గర చుట్టుపక్కల ఆడవాళ్లు నిట్టూర్పులు విడిచారు.

'పిల్లల మొఖం చూసి బతకాలమ్మా' ఎవరో హితవు పలికారు.

ముబషీరా ఏమీ మాట్లాడలేదు.

కానీ భర్త దఫన్ పూర్తయ్యాక ఆ రోజు రాత్రి జబ్బు చేసినట్టుగా పట్టిన నిద్రలో ఆమెకు ఎన్నో పీడకలలు వచ్చాయి. వాటిలో కొన్నింటికి అర్థాలు ఉన్నాయి. కొన్నింటికి లేవు.

ఒక కలలో మాత్రం నల్లమందుతో తన ఆడపిల్లలను స్పృహ తప్పేలా చేసి వారిని ఒక పెట్టెలో ఉంచి దాని మీద నగిషీలు ఉన్న మూతను పెట్టి తాళం వేసినట్టుగా ఆమెకు అనిపించింది. ఒక్క క్షణంపాటు ఆ పని వాస్తవంలో జరుగుతున్నట్టుగా భ్రాంతి కలిగి గబుక్కున మేల్కొందామె.

లేచి కూర్చుంటే ఒళ్లంతా చెమటలు.

మరి కాసేపటికి ఆ భయానికి, తత్తరపాటుకి కడుపు ఉబ్బరించి ఆమెకు మూత్రం వచ్చాయి. ఆ చీకటిలో, పలుచగా ఉన్న గుడ్డి వెలుతురులో నెమ్మదిగా బాత్‌రూమ్‌లోకి వెళ్లి వచ్చిందామె.

ఆమెకు పిల్లలను చూడాలనిపించింది.

లోపల హాలులో ముద్దగా పడి నిద్రపోతున్న ఆడపిల్లల దగ్గరకు వెళ్లి కాసేపు నిలుచుంది. ఏడ్చి ఏడ్చి అలసిపోయిన వాళ్ల ముఖాలు చిన్నబోయి కనిపించాయి. వాళ్లకి కాస్త దూరంగా కొడుకు అస్తవ్యస్తంగా పడి నిద్రపోతున్నాడు. చొక్కా లేని వాడి వొళ్లు ఆ చీకటిలో కూడా పచ్చగా మెరుస్తూ ఉంది.

ఆమె వాడి పక్కకు వెళ్లి కూర్చుంది. కాసేపు వాణ్ణి తేరిపార చూసుకుంది. వయసు వచ్చి, కండలు తేరి, ఉక్కుముక్కలా తయారై ఉన్న కొడుకును చూసుకున్నాక ఆమెకు స్థిమితంగా అనిపించింది. వాడి నాభి నుంచి వక్షం వరకు సన్నగా పాకిన వెంట్రుకల దారిని గమనించాక ఆమెకు తన కొడుకు పెద్దవాడై పోయినట్టుగా అర్థమయ్యింది.

ఆమెకు నెమ్మది నెమ్మదిగా ధైర్యం వచ్చింది. కొడుకు అండతో ఏనాటికైనా ఈ కష్టాలన్నింటి నుంచి దూరమయ్యి హాయిగా బతకగలననే నమ్మకం కుదిరింది.

మొఖానికి పట్టిన చెమటను పవిటతో తుడుచుకొని వాడికి దాపునే స్థలం చేసుకొని నిశ్చింతగా పడుకుందామె. ఆ తర్వాత ఆమెకు పీడకలలు రాలేదు.

ఆ మరుసటిరోజు నుంచి ఆమె మళ్లీ కొత్త జీవితం మొదలుపెట్టింది. పాత జ్ఞాపకాలను మరిచి, పాత బాధలను మరిచి కొత్తగా వీలైనంత ఆశగా జీవితాన్ని కొనసాగించాలని అనుకుంది.

ఇంటికి పరామర్శకు వచ్చిన వారితో 'మా అబ్బాయి చదువు పూర్తయినట్టే. ఇక వాడు ఇక్కడే ఉండి ఉద్యోగం వెతుక్కుంటాడు' అని చెప్పడం మొదలె ట్టిందామె.

ఆమెకు ఇప్పుడిప్పుడు కొడుకు తోడనే లోకం. ఆమె వాడి వెంట వెంటే తిరిగేది. వాడికి వీలైనన్ని మంచి బట్టలు తొడిగేది. వద్దు వద్దంటున్న ఖర్చులకు డబ్బులు జేబులో కూరేది.

'బయట తిరిగేవాడివి. మగాడివి. ఇంటి మర్యాద తెలిసేలా డాబుగా ఉండాలి నాయనా' అనేది.

పిల్లలు ముగ్గురూ నెమ్మది నెమ్మదిగా లోకంలోకి వచ్చి పడ్డారు. మళ్లీ అప్పు డప్పుడు వాళ్ల మాటల్లో నవ్వులు పూస్తూ ఉన్నాయి. సమద్ తన తోబుట్టువు లను ఆటపట్టిస్తూ వారిని హుషారు పరచడానికి ప్రయత్నిస్తున్నాడు. ఒకటి రెండుసార్లు వాళ్లని బయటకు తీసుకువెళ్లాడు కూడా.

వాడికి ఇంగ్లీషులో మంచి ప్రవేశం ఉంది. మనిషి కూడా చూడడానికి ఎర్రగా, పొడుగ్గా, అందంగా ఉంటాడు.

'ఈమాత్రం ఉంటే చాలు అమ్మీ. మార్కెటింగ్‌లో ఫైన్ అయిపోవచ్చు'అనే వాడు వాళ్ల అమ్మతో.

కొత్తల్లో వాడు టక్ చేసి, బూట్లు తొడిగి, టై బిగించి ఇంటర్వ్యూలకు వెళ్లే వాడు. ప్రిలిమినరీ టెస్టులు పాసయ్యేవాడు. గ్రూపు డిస్కషన్లలో కొట్టుకొచ్చే వాడు. షార్ట్‌లిస్టుల్లో కూడా వాడి పేరు కనిపించేది. కానీ ఫైనల్ ఇంటర్వ్యూల్లో మాత్రం ఉద్యోగం తన్నేది.

మొదట మొదట ఏమోలే అనుకున్నాడు. ఆ తర్వాత దురదృష్టం అని తిట్టు కున్నాడు. మనం చాల్లేదేమో అని సర్ది చెప్పుకున్నాడు. అనుభవం లేదు కదా అని ఊరడించుకున్నాడు. కాని నెమ్మది నెమ్మదిగా అవన్నీ కారణాలు కావనీ గాలిలోనే ఏదో మార్పు ఉందనీ అర్థమయ్యాక ఉన్నట్టుండి అన్ని ప్రయత్నాలూ మానేశాడు.

ఉద్యోగం లేదు. ప్రయత్నమూ లేదు.

రాను రాను వాడు ఎంత సహజమైన పాతబస్తీ కుర్రాడిలా మారిపోయా డంటే.. ఛోటా సిగరెట్, సాదాపాన్, ఇరానీ కేఫ్‌లో చాయ్, దోస్తులతో ఢేడ్‌సారె బాతే..

ఉదయం ఎప్పుడు వెళ్లేవాడో, రాత్రి ఎప్పుడు వచ్చేవాడో...

ఏమన్నా అంటే కోపం.. పెద్ద పెద్దగా కేకలు వేసేవాడు.

ముబషీరా వాణ్ణి బెరుకు బెరుకుగా చూసేది. వాణ్ణి బుజ్జగించాలంటే ఆమెకు సంశయంగా అనిపించేది.

ఒకరోజు రాత్రి మాత్రం వాడు తాగి వచ్చినట్టుగా అనుమానం వేసి మౌనంగా వెళ్లి వాడి పక్కన కూర్చుందామె.

వాడు మంచం మీద పడుకొనే ఉన్నాడు. ఆమె వచ్చినట్టుగా వాడికి అర్థమైంది.

'అమ్మీ' అన్నాడు కళ్లు మూసుకొనే, ఆమె ఒడి నిండా చేయి వేసి దగ్గరకు తీసుకుంటూ.

'ఊ' అందామె.

'కోపంగా ఉందా అమ్మీ'

ఆమె మౌనంగా ఉంది.

'చెప్పు అమ్మీ'..

'లేదురా. నాకెందుకురా కోపం'

'లేదు అమ్మీ. నీకు కోపం వచ్చే ఉంటుంది. నిన్నూ నన్నూ నమ్ముకొని అదిగో ఆ మూల గదిలో నిద్రపోతున్నారే ఆ మాసూమ్ బొమ్మలు నా చిట్టి తల్లులు వాళ్లకు కూడా కోపం వచ్చి ఉంటుంది. మీరంతా కలిసి నన్ను ఛీ అనుకొని ఉంటారు. నేను ఏం చేయను అమ్మీ. అంతా మారిపోయి ఉంది. మనం బతకడం కష్టం అమ్మీ'

'తప్పురా. అలా మాట్లాడకూడదు. ధైర్యంగా ఉండాలి. ఎప్పుడూ ధైర్యం ఓడిపోకూడదురా'

'పదిసార్లు ధైర్యంగా ఉంటాము అమ్మీ. పదకొండోసారి ఉండలేం కదమ్మా'

'ఇప్పుడేమైందిరా'

'పేరు కొట్టేస్తున్నారు అమ్మీ. ముసల్మాన్ అనే పేరు కనిపిస్తేనే కొట్టేస్తున్నారు. ఇంక పేరు కింద పాతబస్తీ అడ్రస్ కనిపిస్తే లోపలికి కూడా రానివ్వడం లేదు. ఏదో మార్పు ఉంది అమ్మీ. మన మీద అనుమానం ఎక్కువగా ఉంది. ద్వేషం ఎక్కువగా ఉంది. కొంతమందే బయటకు చెబుతున్నారుగానీ చాలా

మంది మనసుల్లో కరడు కట్టి ఉంది. బయటకు చెప్తే ఎదుర్కోవచ్చు. ఇలా లోపల పెట్టుకొని చేసేవాళ్లతో ఎలా అమ్మీ. మనం ఏం చేశామని అమ్మీ?'

'లేదురా. అందరూ అలా ఉండరు నాన్నా. నీలాగా నాలాగా వాళ్లలో కూడా చాలా మంది మంచివాళ్లు ఉన్నారురా. వాళ్లంతా లేకుంటే మనం ఇలా బతికి ఉండేవాళ్లం కాదురా'

'మా దోస్తులు కూడా ఒకరిద్దరు బతుకుతున్నారు అమ్మీ. పేర్లు మార్చుకొని. చూశాను కదా. మార్కెటింగ్‌లో ముసల్మాన్‌ల పేర్లు పనికి రావట. బిజినెస్ ఇవ్వరట'

'సమద్'.. ఆమెకు ఏడుపు వచ్చింది.

'నన్ను భయపెట్టకురా. మనం ఒక పక్కగా ఉంటే చాలు. మన మానాన మనం ఉంటే చాలు. మనకేం కాదు'

'ఒక పక్కగా ఎక్కడ అమ్మీ. మనం చాలా వెనుక ఉన్నాం. చాలా దూరంగా ఉన్నాం. అయినా కానీ పగబట్టినట్టుగా వెంటబడుతున్నారే'.. వాడి కళ్లలో నుంచి వెచ్చటి ఊట ఉబికింది.

'సమద్... బంగారూ... అయ్యో... మనం ఇక్కడికి రాకపోయినా బాగుండేదిరా'

'ఇక్కడకా అమ్మీ... అదేం కాదు అమ్మీ. మనం ఎక్కడకు వెళ్లినా అంతే. ఏ ఊళ్లో ఉన్నా అంతే. బతకలేం. బతకనివ్వరు'

'సమద్.. అలా అనకురా.. నువ్వు ఏమీ చేయక్కర్లేదురా. మామూలుగా ఉండు. ఇంట్లో ఉండరా చాలు. ఎలాగోలా బతుకుదాం. ముందు ఈ వేషం మార్చురా'

'ఈ వేషమా అమ్మీ...' వాడు నవ్వాడు.

'టెర్రరిస్టులాగా కనిపిస్తున్నాను కదూ. నన్ను తీసుకెళ్లి కాల్చేస్తే నువ్వు కూడా నమ్మేటట్టుగా ఉన్నాను కదూ' నవ్వుతూనే ఉండిపోయాడు.

ఆ తర్వాత వాడు చాలా సేపు పలవరిస్తూనే ఉన్నాడు. ఏమిటేమిటో మాట్లాడుతూనే ఉన్నాడు. ఉండి ఉండి తల్లిని దగ్గరగా తీసుకుని ముడుచుకుంటూనే ఉన్నాడు.

రాత్రంతా ముబష్షీరా వాడి పక్కనే కూర్చుని కునికిపాట్లు పడింది.

ఆ మరుసటి రోజు ఆదివారం.

ఆమె లేచేటప్పటికే సమద్ లేడు. ఆమె ఆ సాయంత్రం దాకా వాడి కోసం చూసింది. ఆ మరునాడు వస్తాడేమోనని అనుకుంది. ఆ తర్వాతి రోజంతా ఎదురుచూసింది.

ఆదివారాలు చాలా వచ్చాయి. ఆదివారాలు చాలా వెళ్లాయి.

సమద్ రాలేదు.

ముబషీరా దువా చేసింది.

సమద్ రాలేదు.

ఆడపిల్లల చేత మొక్కులు మొక్కించి లెక్కలేనన్నిసార్లు నమాజ్‌లు చదివించింది.

సమద్ రాలేదు.

కొన్ని రోజుల పాటు ఆ తల్లీకూతుళ్లు గడప దగ్గర నిలుచుని ఎవరి కోసమో ఎదురుచూస్తున్నట్టుగా దారినపోయేవారికి కనిపించేవారు.

అదీ కొన్ని రోజులే.

ఆ తర్వాత వారి ఇంటి తలుపులు, కిటికీ తలుపులు పెద్దగా తెరుచుకున్నట్టుగా ఎవరూ గమనించలేదు.

పరదాలు వాటిని అలాగే మూసి ఉంచేశాయి ఎప్పటికీ.

■

■ గిన్నెలపై పెట్టే 'మూత'ను ముస్లింలు 'ఢాకన్' అంటారు. 'ఢక్కన్' అని కూడా పిలుస్తారు.

కథా నిలయం
5635
శ్రీకాకుళం